Andhra Jyothy 01/12/17

# మెట్రో స్టేషన్లు కిటకిట

- రెండో రోజు 1. 60 లక్షల మంది ప్రయాణించారని అధికారుల అంచనా
- రద్దీగా కొన్ని ప్రధాన స్టేషన్లు.
- ఆఫీసు వేళల్లో ప్రయాణికుల తాకిడి ఎక్కువవంటున్న సిబ్బంది
- భద్రతను పర్యవేక్షించిన పోలీసు ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి: జనసామాన్యానికి మెట్రో అందుబాటులోకి వచ్చిన రెండో రోజు స్టేషన్లన్నీ జనసందోహంగా మారాయి. గురువారం మెట్రోలో 1.60 లక్షల మంది ప్రయాణించారని అధికారులు తెలిపారు. మెట్రో సేవలు ప్రారంభమైన తొలిరోజు రెండు లక్షల మంది ప్రయాణించారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. తొలి రోజు ఉదయమే మొదటిసారి తొలి మెట్రో అనుభవాన్ని పొందాలన్న ఉత్సాహంతో చాలా మంది వేకువజాము 5 గంటలకే మెట్రో స్టేషన్ల వద్ద బారులు తీశారు. అయితే రెండో రోజు ఉదయం 7 గంటల వరకూ అన్ని స్టేషన్లలో ప్రయాణికులు అరకొరగానే ఉన్నారు. సమయం 7.30 దాటడంతో ప్రయాణికుల రాక పెరుగుతూ వచ్చిందని సిబ్బంది పేర్కొన్నారు.

ఉదయం 8నుంచి11 గంటల వరకూ గురువారం అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ స్టేషన్‌తో పాటు చివరి స్టేషన్‌లైన మియాపూర్,నాగోల్‌లలో సైతం ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం12నుంచి 3వరకూ ప్రయాణికుల రద్దీ ఉదయం కంటే, కాస్త తగ్గినప్పటికీ బోగీలన్నీ జనంతో నిండున్నాయి. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకూ మళ్లీ రద్దీ ఎక్కువగా ఉంటోందని మెట్రో సిబ్బంది తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు వివిధ నగరాల్లో ప్రారంభమైన మెట్రోల్లో తొలి రోజు 50వేలకు మించి ప్రజలు ప్రయాణించలేదు. హైదరాబాద్ మెట్రోలో అంతకు మించి రెండో రోజు సైతం ప్రయాణించడంతో మెట్రో అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. "నగరాల్లో టీపీఓ, సాఫ్ట్‌వేర్ పలు రంగాల్లోని కార్యాలయాలు 24 గంటలూ పనిచేస్తాయి. కనుక ఆఫీసు పనివేళలను దృష్టిలో ఉంచుకొని, కనీసం అర్ధరాత్రి 12 గంటలవరకూ మెట్రో సేవలు అందుబాటులో ఉంటే బాగుంటుందని" కొందరు ప్రయాణికులు కోరుతున్నారు.

## రద్దీగా ప్రధాన స్టేషన్లు...

అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్ స్టేషన్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, బేగంపేట్, ప్యారడైజ్, సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్, నాగోల్ స్టేషన్లు ఉదయం 8నుంచి రాత్రి9 గంటల వరకూ ప్రయాణికులతో రద్దీగా ఉంటున్నాయి. ఈఎస్ఐ, ఎర్రగడ్డ, రసూల్‌పురా, పేట్, ఉప్పల్ స్టేడియం స్టేషన్, ఎన్‌జీఆర్ఐ స్టేషన్లలో మధ్యాహ్నం 12 నుంచి 3 వరకు మధ్య ప్రయాణికుల రద్దీ చాలా తక్కువగా ఉందని సిబ్బంది తెలిపారు. అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మియాపూర్, బేగంపేట్, ప్యారడైజ్, సికింద్రాబాద్, మెట్టుగూడ, తార్నాక మినహా మిగతా మెట్రో స్టేషన్లలో రాత్రి తొమ్మిది తర్వాత ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉందని తెలిపారు.

## పర్యవేక్షిస్తున్న మెట్రో ఉన్నతాధికారులు...

మెట్రో రైళ్లు తిరుగుతున్న 30 కి.మీ మార్గంలో ప్రయాణికుల భద్రత నేపథ్యంలో ప్రత్యేకంగా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డి ఎన్వీఎస్ రెడ్డితో పాటు ఎల్ అండ్ టీ ఎం.డి, సీఈఓ శివానంద్ ఆ మార్గాల్లో మెట్రో రైళ్లలో ప్రయాణించారు. ప్రయాణికులను పలకరిస్తూ, స్టేషన్‌లలోని వసతులు, ఇతర అంశాలను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఎన్వీఎస్ రెడ్డి బేగంపేట మెట్రో స్టేషన్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి కొద్ది దూరం ప్రయాణించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మెట్రో ఉన్నతాధికారులు ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం రాకుండా చూడాలని స్టేషన్‌ల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మంత్రి కేటీఆర్ సైతం మెట్రో అధికారులకు భద్రతపై ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేయడంతో డీజీపీ ఎం.మహేందర్ రెడ్డితో పాటు మెట్రో అధికారులు, పోలీసులు ఉన్నతాధికారులు అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లో ప్రత్యేకంగా భద్రతను పర్యవేక్షించారు. గురువారం మెట్రోలో ప్రయాణిస్తూ అనేక మంది సెల్ఫీలు తీసుకుంటూ సంబరపడ్డారు.



కిటకిటలాడుతున్న అమీర్‌పేట మెట్రోస్టేషన్



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎన్వీఎస్‌రెడ్డి